

పాలసీదారు కుటుంబానికి బీమా చెక్కును అందజేస్తున్న పోస్టల్ అధికారులు

పోస్టల్ బీమాతో భరోసా

- 21మందికి రూ. 10 లక్షల చొప్పున పరిహారం
- ఈ నెల 20 నుంచి 24 వరకు స్పెషల్ డ్రైవ్
- పోస్టల్ ఎస్పీ శివాజీ

విద్యానగర్, ఫిబ్రవరి 18: పోస్టల్ ప్రమాద బీమా పాలసీదారుల కుటుంబాలకు భరోసానిస్తున్నది. మరణించిన, గాయపడ్డ వారి ఖాతాల్లో వెనువెంటనే నగదు జమవుతున్నది. ఏడాది వ్యవధిలో కరీంనగర్ డివిజన్ పరిధిలో 21 మంది పాలసీదారులు మరణించగా బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందింది. అలాగే వివిధ ప్రమాదాల్లో గాయాలపాలైన 40 మందికి పాలసీ ప్రకారం రూ.10 వేల నుంచి రూ.70 వేల వరకు అందించారు. కాగా, పోస్టల్ బీమా పథకాల్లో చేరేందుకు ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని కరీంనగర్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శివాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది 50వేల మంది, ఈ సంవత్సరం ఇప్పటివరకు డివిజన్‌లో మొత్తం 25వేల మంది ప్రమాద బీమా చేసుకున్నారని వివరించారు. ఐదు ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా మూడు రకాల పాలసీలు (రూ.5, 10,15 లక్షలు) రూ. 320 నుంచి మొదలుకొని రూ. 775 వరకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రమాద బీమా తీసుకోవాలనుకునే వారు రూ. 200 తో ఐపీపీబీ ఖాతా తెరువాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దగ్గరలోని పోస్టాఫీసుల్లో సంప్రదించి వీలైన పాలసీని ఎంచుకుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి

చిగురుమామిడి, ఫిబ్రవరి 18: కేసీఆర్ పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని ఎంపీపీ కొత్త వినీతా శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, జిల్లా నాయకుడు సాంబారి కొమురయ్య బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం చిగురుమామిడిలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు కరెంట్, నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నారాన్నారు. కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేసి కరీంగనర్ పార్లమెంట్ స్థానంలో గులాబీ జెండాను ఎగురవేయాలన్నారు.

శాంతి ర్యాలీలో పాల్గొన్న నియోజకవర్గ పాస్టర్స్, క్రైస్తవులు

క్రైస్తవుల శాంతి ర్యాలీ

హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 18: రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామంలో ఇటీవల క్రైస్తవులపై జరిగిన దాడికి నిరసనగా హుజూరాబాద్ నియోజకవర్గంలోని పాస్టర్స్, క్రైస్తవులు ఆదివారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. పలు చర్చిల నుంచి స్థానిక అంబేద్కర్ చౌరస్తా వరకు చేరుకుని, దాడి ఘటనను ఖండిస్తూ నినాదాలు చేశారు. రేవరెండ్ సతీశ్, పాస్టర్స్ నవీన్‌కుమార్, రాజ్‌కుమార్, ఉదయ్‌కుమార్, జాన్, ప్రభాకర్, గంగరాజు, దేవదాస్, సొల్లు బాబు, బాపయ్య, దశరథ, భిక్షపతి, కవిత, నవీన్, కృపారాజ్, సరళ, క్రైస్తవులు పాల్గొన్నారు.

WANTED

jobs Apply Now

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319440-All

PLOT FOR SALE

★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, మౌంట్ ఒపేర, గ్రీన్ సిటీ, సుచిరిండియాలో ప్లాట్లు కొనబడును. నో Brokrs. 9553973999 / 6303049720.
NT-313892

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కరాటే కిడ్

ఆ అమ్మాయి పంచ్ విసిరితే ప్రత్యర్థి చిత్తు కావాల్సిందే.. కోర్టులో దిగితే పతకం ఖాతాలో చేరాల్సిందే.. మార్షల్ ఆర్ట్స్‌లో మెరుస్తూ మెడల్స్‌నూ కొల్లగొడుతున్నది. యుద్ధక్రీడలో ఓ ఆటో డ్రైవర్ బిడ్డ అప్రతిహతంగా దూసుకెళ్తున్నది. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో 50కి పైగా పతకాలు సాధించింది. సర్కారు ప్రోత్సాహం అందిస్తే మరింతగా రాణిస్తానని నమ్మకంగా చెబుతున్నది పోరండ్లకు చెందిన శ్రీనిధి.

పంచ్ విసిరితే ప్రత్యర్థి చిత్తే

- కరాటేలో రాణిస్తున్న ఆటో డ్రైవర్ బిడ్డ శ్రీనిధి
- పతకాల పంట పండిస్తున్న పోరండ్ల అమ్మాయి

సాధించిన పతకాలు

- గతేడాది మలేషియాలో జరిగిన ఇంటర్నేషల్ కరాటే పోటీల్లో సిల్వర్ మెడల్స్.
- 2022లో హైదరాబాద్‌లో జరిగిన ఇంటర్నేషనల్ గ్లోబల్ షొటోకాన్‌లో రెండు కాంస్య పతకాలు.
- ఇంటర్ స్టేట్ లెవెల్‌లో బంగ్లాదేశ్, ఢిల్లీ, పరకాల, హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్
- గతేడాది విశాఖపట్నంలో జరిగిన ఏషియన్ పోటీల్లో గోల్డ్ మెడల్.

-తిమ్మాపూర్, ఫిబ్రవరి 18

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్లకు చెందిన పారునంది చంద్రయ్య–అనూష దంపతుల కూతురు శ్రీనిధికి చిన్నప్పటి నుంచే కరాటే అంటే మక్కువ. అల్గునూర్‌లోని సెంట్రల్‌స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఆమె ఎనిమిదేండ్ల నుంచే కరాటే శిక్షణ పొందుతున్నది. ఆటో డ్రైవర్ అయిన శ్రీనిధి తండ్రి కుమార్తెను ప్రోత్సహిస్తూ మార్షల్ ఆర్ట్స్‌లో కరీంనగర్‌కు చెందిన శ్రీనివాస్ కోచ్ వద్ద శిక్షణ ఇప్పిస్తున్నాడు. ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు ఆటోలో కరీంనగర్‌లోని ధన్గర్‌వాడీ స్కూల్‌కు తీసుకెళ్తాడు. శిక్షణ తర్వాత స్కూల్ టైం వరకు ఇంటికి తీసుకువస్తాడు. ఇలా కొన్నేళ్లుగా ట్రైనింగ్ తీసుకుంటూ రాటుదేలిన శ్రీనిధి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీ స్థాయి పోటీల్లో అనేక విజయాలు నమోదు చేసుకున్నది.

సాధించిన పతకాలు, ట్రోఫీలతో శ్రీనిధి

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..

మా నాన్న చంద్రయ్య ఎంతో ఇష్టంతో చిన్నప్పుడే నన్ను కరాటే శిక్షణలో చేర్పించారు. నేను కూడా అంతే ఆసక్తితో ప్రాక్టీస్ చేస్తూ పతకాలు సాధిస్తున్న. మా సార్ శ్రీనివాస్ నేర్పిన మెళకువలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అంతర్జాతీయ క్రీడాకారిగా ఎదగాలని ఉన్నది. అయితే ఆర్థిక పరిస్థితులు సహకరించడంలేదు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని ఈవెంట్లలో పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు తీసుకువస్తా.

-శ్రీనిధి, కరాటే చాంపియన్

ఇటీవల కరీంనగర్‌లో జరిగిన పోటీల్లో సినీహీరో సుమన్ చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న శ్రీనిధి

చలో సెక్రటేరియట్‌కు తరలిరావాలి

తెలంగాణచౌక్,ఫిబ్రవరి18: ధూప దీప నైవేద్య అర్చకుల సమస్యల పరిష్కారానికి ఈనెల 20న నిర్వహించనున్న చలో సెక్రటేరియేట్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తిరునగరి వెంకటాద్రి స్వామి పిలుపునిచ్చారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి సమస్యలను వివరిస్తామని చెప్పారు. కార్యక్రమానికి జిల్లాలోని అర్చకులు తరలిరావాలని కోరారు.

విద్యార్థులకు అభినందన

విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి

గంగాధర, ఫిబ్రవరి 18: కరీంనగర్ అల్ఫోర్స్‌స్కూల్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థా యి కరాటేలో గంగాధర వివేకానంద స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. కటాస్‌లో అక్షిత్ బంగారు, భగీరథ, సృజన, ప్రణీత్, సిరి, అక్షర, కార్తీక్ రజత, హాసిని లలిత, వరూధిని, శ్రీచైతన్య, ఉజ్వల, కార్తీక్, గణేశ్, రంజిత్, వరాలిని, శ్రీహిత, చైత్రిక కాంస్య పతకాలు సాధించారు. వీరిని ఆదివారం కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి, డైరెక్టర్ అనంతరెడ్డి, హెచ్ఎంలు ఉషారాణి, నర్సింగరావు, కరాటే మాస్టర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

హుజూరాబాద్ బస్టాండ్‌లో ప్రచారం చేస్తున్న సామాజిక కార్యకర్త వేణుగోపాల్

హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 18: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు అందరూ సహకరించాలని సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ ఆదివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో విస్తృతంగా ప్రచారం చేశారు. మేడారం జాతరకు వెళ్లే ప్రయాణికులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించి చైతన్యపరిచారు. ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్‌కు బదులు క్లాత్ బ్యాగ్స్, స్టీల్ డబ్బాలు వాడాలని సూచించారు. కాగా, పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న సామాజిక కార్యకర్తను డిపో మేనేజర్ శ్రీకాంత్ అభినందించారు.

నేడు ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

శివాజీ నగర్‌లో ఏర్పాటు చేసిన ఛత్రపతి విగ్రహం

హుజూరాబాద్‌టౌన్, ఫిబ్రవరి 18: పట్టణంలోని శివాజీనగర్‌లో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని సోమవారం హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆవిష్కరించనున్నట్లు ఆరే సంఘం నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శివాజీ జయంతిని పురస్కరించుకొని విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారని పేర్కొన్నారు. విగ్రహావిష్కరణ అనంతరం సభ, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డితో పాటు ఏసీపీ శ్రీనివాస్‌జీ, బల్దియా చైర్‌పర్సన్ గందె రాధిక, కౌన్సిలర్ ప్రతాప మంజులా కృష్ణ, కుల సంఘ నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు వినోద్‌కుమార్ పర్యటన

గంగాధర, ఫిబ్రవరి 18: మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సోమవారం గంగాధర మండలంలో పర్యటించనున్నారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గట్టుభూత్కూర్‌లో శివాజీ జయంతి వేడుకలకు హాజరవుతారని తెలిపారు. అనంతరం ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 18: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా సోమవారం నగరంలో నిర్వహించనున్న బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని హిందూ వాహిని జిల్లా సంయోజక్ బెజ్జంకి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం మాట్లాడుతూ, సాయంత్రం 6 గంటలకు ర్యాలీ ఆర్ఎస్ఎస్ కార్యాలయం నుంచి ప్రారంభమై మంచిర్యాల చౌరస్తా, గీతాభవన్, టవర్‌సర్కిల్ మీదుగా పద్మనగర్ శివాజీ మహారాజ్ విగ్రహం వరకు కొనసాగుతుందని తెలిపారు.

విద్యార్థులకు టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణ

మాక్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ట్రైనర్

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 18: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నాంది ఫౌండేషన్ ద్వారా మహేంద్ర ప్రైడ్ క్లాసు ట్రైనింగ్ నిర్వహించారు. ఈ నెల 12న ప్రారంభమైన శిక్షణ 17వ తేదీ వరకు కొనసాగింది. ఇందులో 120 మంది విద్యార్థులు శిక్షణ పొందారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీ శ్రీ లక్ష్మి, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ శోభారాణి పేర్కొన్నారు. ఇక్కడ ట్రైనర్ ఓం ప్రకాశ్, టాస్క్ ఎఫ్‌టీఎం రాజశేఖర్ ఉన్నారు.

శ్రీరాముడి చిత్రపటాల పంపిణీ

లక్ష్మీపూర్‌లో శ్రీరాముడి చిత్రపటాలను పంపిణీ చేస్తున్న నాయకులు

మానకొండూర్ రూరల్, ఫిబ్రవరి 18: మండలంలోని లక్ష్మీపూర్‌లో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం 61, 62వ పోలింగ్ బూత్‌ల అధ్యక్షులు ఉప్పు సాయి నీతేశ్‌పటేల్, రాపాక లక్ష్మణ్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాముడి చిత్రపటాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఇక్కడ బీజేపీ మండలాధ్యక్షుడు రాపాక ప్రవీణ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి బండారి హరీశ్, ఎస్సీ మోర్చా నేత గుండేటి లక్ష్మీనారాయణ ఉన్నారు.

భూసార పరీక్షపై అవగాహన

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 18: జిల్లెల్లలోని వ్యవసాయ కళాశాలలో మృత్తిక శాస్త్ర విభాగంలో భూసార, నీటి పరీక్ష యూనిట్‌ను జిల్లెల్ల రైతులు సందర్శించారు. భూసార, నీటి పరీక్షల ప్రాముఖ్యత, నీటిలో లవణ సాంద్రతపై ప్రొఫెసర్లు వారికి అవగాహన కల్పించారు. భూసార పరీక్షల కోసం రైతులు 99510 24256, 84593 21228 సెల్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అలాగే కళాశాలలో వర్మి కంపోస్ట్ యూనిట్‌ను రైతులు సందర్శించారు. ఇక్కడ అసోసియేట్ డీన్ శ్రీదేవి, మేనేజింగ్ డైరెక్టర్లు ప్రొఫెసర్ కనకదుర్గ, వాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రియదర్శిని, డైరెక్టర్ సీహెచ్ రమేశ్, విద్యార్థులు ఉన్నారు.

మినీ అంగన్‌వాడీ సెంటర్ల అప్‌గ్రేడ్

- పెరిగిన టీచర్, ఆయా పోస్టుల సంఖ్య
- నోటిఫికేషన్ కోసం మహిళల ఎదురుచూపులు

కలెక్టరేట్, ఫిబ్రవరి 18: జిల్లాలోని 25 మినీ అంగన్‌వాడీ సెంటర్లు అప్‌గ్రేడ్ అయ్యాయి. గతంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అంగన్‌వాడీ సెంటర్ల సేవలను విస్తరించాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగింది. ఇటీవలే కేంద్రం మినీ అంగన్‌వాడీ సెంటర్లను అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే కరీంనగర్ జిల్లాలోని నాలుగు ప్రాజెక్టుల పరిధిలో 752 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా పిల్లలు, గర్భిణులకు సంపూర్ణంగా సేవలు అందుతున్నాయి. మినీ సెంటర్లలో మాత్రం వసతులు కొరవడడంతో సేవలందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిలో 20 మంది టీచర్లు పనిచేస్తుండగా వీరిని అప్‌గ్రేడ్ చేస్తూ, ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మినీ సెంటర్లు అప్‌గ్రేడ్ కావడంతో వాటిలో కొత్తగా ఆయాల పోస్టులు రాబోతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం 30 అంగన్‌వాడీ టీచర్ల ఖాళీలు భర్తీ చేసింది. మినీ సెంటర్లలో టీచర్లను కూడా అప్‌గ్రేడ్ చేయడంతో వారి వేతనం కూడా పెరుగనున్నది. గతంలో రూ.7,800 మాత్రమే వస్తుండగా, ప్రస్తుతం రూ.13,650 వేతనం పొందుతున్నారు. దీంతో, అప్‌గ్రేడ్ అయిన టీచర్లలో ఆనందం వ్యక్తమవుతోంది. ఆయా పోస్టుల నోటిఫికేషన్ కోసం కేంద్రాల పరిధిలోని మహిళలు ఎదురుచూస్తున్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

గంగాధర/ శంకరపట్నం, ఫిబ్రవరి 18: సమ్మక్క, సారలమ్మ జాతర నేపథ్యంలో గంగాధర మండలం బూరుగుపల్లి గ్రామస్తులు ఆదివారం పోచమ్మ బోనాలు తీశారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో వీరభద్రస్వామి ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా గ్రామస్తులు పోచమ్మ బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఊరి బయట ఉన్న పోచమ్మ ఆలయానికి బోనాలతో తరలివెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

శంకరపట్నం: మొలంగూర్‌లో నెత్తిన బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఆస్తిపన్ను సమస్యలపై కమిషనర్ దృష్టి

- ప్రతి మంగళ, శుక్రవారాల్లో వినతుల స్వీకరణ

కార్పొరేషన్, ఫిబ్రవరి 18: నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్ను సమస్యలపై బల్దియా కమిషనర్ దృష్టి పెట్టారు. మార్చి 31న ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తుండగా ఆస్తి పన్ను భారీగా పెరిగిందంటూ పలువురు ఇంటి యజమానులు ఫిర్యాదు చేస్తున్నారు. అయితే రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోకపోవడంతో పన్నువసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆస్తి పన్నుల విషయంలో సమస్యలు ఉన్నవారు ప్రతి మంగళ, శుక్రవారాల్లో సాయంత్రం 4నుంచి 6 గంటల మధ్య నేరుగా తనను కలుసుకునే అవకాశాన్ని కమిషనర్ కల్పించారు. తమ సమస్యలు, అభ్యంతరాలను తెలియజేయాలని సూచించారు.

మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు

గుమ్మడికాయ కొట్టి మేడారం జాతర ప్రత్యేక బస్సును ప్రారంభిస్తున్న ఆర్టీసీ డీఎం శ్రీకాంత్

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 18: మేడారం సమ్మక్క జాతరకు హుజూరాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులను ఆదివారం స్థానిక బస్టాండ్‌లో డిపో మేనేజర్ శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి నుంచి ఈ నెల 25 వరకు నిత్యం 120 బస్సులు హుజూరాబాద్ మీదుగా మేడారానికి నడుపుతున్నట్లు తెలిపారు. భక్తులు ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీఐ మురళి, ఏఎంఎఫ్ సమ్మయ్య, బస్టాండ్ మేనేజర్ వీవీఆర్ రెడ్డి, సిబ్బంది సురేఖ, ఎస్ఎస్ రాణి, జాఫర్, టీఎస్ సింగ్, ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ వెంకటరాజం పాల్గొన్నారు.

వివాహ వేడుకలకు హాజరైన ప్రముఖులు

వధూవరులతో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ తదితరులు

తిమ్మాపూర్, ఫిబ్రవరి 18: మండలంలోని నుస్తులాపూర్ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ రాష్ట్ర నేత తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, సంధ్య దంపతుల కొడుకు సంతోష్– హర్షిణి వివాహం ఆదివారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, నగర మేయర్ సునీల్ రావు, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, సుంకె రవి శంకర్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు బిర్లా స్కూల్ విద్యార్థులు

ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయిని బబితా విశ్వనాథన్ తదితరులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 18: జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు బిర్లా స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని హెడ్మాస్టర్ బబితా విశ్వనాథన్ ఆదివారం తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన పోటీల్లో లావర్తి సన (గ్రేడ్–7) నీటిలో తేలియాడే చెత్తను సేకరించే యంత్రం, రయాస్ అబ్దుల్లా (గ్రేడ్–8) బహుళ ఉపయోగకర వాహనం, సదుర్ల వైనవి రైలు ప్రమాదాల నివారణ యంత్రం రూపొందించి సత్తా చాటారని పేర్కొన్నారు. వీరిని హెడ్మాస్టర్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఇరుకుల్లలో సమ్మక్క జాతరకు ఏర్పాట్లు

ఇరుకుల్ల వనదేవతల గద్దెలు

జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 18: ఇరుకుల్ల వాగులోని చెక్ డ్యాం వద్ద సమ్మక్క సారలమ్మ జాతర కోసం కమిటీ చైర్మన్ బుర్ర చంద్రయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. గద్దెలను శుభ్రం చేసి రంగులు అద్దారు. జాతర ప్రాంతాన్ని చదును చేయించారు. విద్యుత్ దీపాలను అమర్చారు. ఆదివారం కమిటీ సభ్యులు జగన్మోహన్‌రెడ్డి, సమ్మయ్య, బాబు, ప్రసాద్ నారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న కార్యవర్గ సభ్యులు

శ్రీచైతన్య యూత్ క్లబ్ కార్యవర్గం

మానకొండూర్, ఫిబ్రవరి 18: మానకొండూర్ శ్రీచైతన్య యూత్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నెల్లి మురళి, ఉపాధ్యక్షుడిగా మొగిలిపాక శ్రీకాంత్, కార్యదర్శిగా నెల్లి రవీందర్, కార్యవర్గ సభ్యులుగా రెడ్డి నాగరాజు, నెల్లి శ్రీనివాస్, నెల్లి మారుతి, బండి ఆంజనేయులు, నెల్లి భాస్కర్, నెల్లి అనిల్, నెల్లి రమేశ్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడిని కార్యవర్గ సభ్యులు సన్మానించారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 18: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎస్ఐ దాస సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ఆదివారం మండల స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, క్రీడాకారులు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇక్కడ పోటీల నిర్వాహకులు, క్రీడాకారులు ఉన్నారు.

విశ్వబ్రాహ్మణ కమిటీ ఎన్నిక

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా దేశరాజు తిరుపతి, ఉపాధ్యక్షులుగా తిప్పారపు శ్రీనివాస్, కొడుముంజ రవి, ప్రధాన కార్యదర్శిగా కొడుముంజ తిరుపతి, కోశాధికారిగా తిప్పారపు సురేశ్, సహాయ కార్యదర్శిగా విఠల్, సలహాదారులుగా హన్మాండ్లు, వెంకటాచారి ఎన్నికయ్యారు.